రోడ్డు నిర్మించండి మహాప్రభో..!

- అధ్వానంగా చావలి – కనగాల లింక్ రోడ్డు
- నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని కోరుతున్న ప్రజలు



అధ్వానంగా చావలి నుంచి కనగాల లింక్ రోడ్డు(కొంత వరకు నిర్మించినది)

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అధ్వాన స్థితిలో ఉన్న లింక్ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. చావలి నుంచి కనగాల వెళ్లు లింక్ రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు చావలి – కనగాల లింక్ రోడ్డు దగ్గర మార్గమని, ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ రోడ్డు నిర్మాణం మాత్రం జరగడం లేదని రోడ్డు నిర్మించండి మహాప్రభో.. అని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అధ్వానంగా ఉంది

కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సోమరౌతు సతీష్ పాల్ లింక్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు తీసుకొని వచ్చి కొంత వరకు రోడ్డు వేశారు. కానీ ప్రస్తుతం అది కూడా ఏళ్లు గడవడంతో అధ్వానంగా తయారయిందని.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. గతంలో పది సంవత్సరాల పాటు నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా ఉన్నారు.. మంత్రిగానూ పని చేశారు. అయినా రోడ్డు గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024లో తిరిగి ఎమ్మెల్యేగా నక్కా ఆనందబాబు ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఇప్పుడైనా చావలి నుంచి కనగాల వెళ్లు లింక్ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకుంటారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పనులు చేపట్టకపోవడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఇప్పటికైనా లింక్ రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లింక్ రోడ్డు కీలకం

నూతన జిల్లాగా బాపట్ల ఏర్పాటు చేయడంతో బాపట్ల వెళ్లేందుకు చావలి నుంచి కనగాలు వెళ్లు లింక్ రోడ్డు చాలా కీలకం. మండలంలోని చాలా గ్రామాల ప్రజలు బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్లడానికి లింక్ రోడ్డు అవసరం ఎంతైనా ఉంది. వేమూరు మండలంలోని చావలి, పెరవలి, పెరవలిపాలెం, పెనుమత్రు, కోడిపత్రు, బలిజేపల్లి, వేమూరు, జంపని, వరహాపురం, వెల్లబాడు, కుచ్చెళ్లపాడు, చదలవాడ, చంపాడు, బూతుమల్లి గ్రామాలకు ఈ రోడ్డు దగ్గరగా ఉంటుంది. బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు చావలి, కనగాల, చెరుకపల్లి చందోలు మీదగా ప్రయాణించడానికి దగ్గరగా ఉంటుంది. కావున కూటమి ప్రభుత్వం చావలి – కనగాల లింక్ రోడ్డుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వేడుకుంటున్నారు.



చావలి నుంచి కనగాల వెళ్లు గుంతల రోడ్డు

కనగాల లింక్ రోడ్డు వేయాలి



చావలి నుంచి కనగాల వెళ్లు లింక్ రోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలి. రోడ్డు మొత్తం వేయాలి. బాపట్ల వెళ్లేందుకు లింక్ రోడ్డు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది.

– విష్ణుమొలకల వెంకటేశ్వర్లు, చావలి, వేమూరు మండలం

లింక్ రోడ్డుపై నిర్లక్ష్యం



చావలి నుంచి కనగాల వెళ్లు లింక్ రోడ్డు నిర్మాణంపై పలు రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేయడం వల్ల రోడ్డు నిర్మాణం జరగలేదు. కూటమి ప్రభుత్వం లింక్ రోడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలి.

– తాడికొండ శ్రీనుబాబు, కుచ్చెళ్లపాడు, వేమూరు మండలం

సాగులో విత్తన శుద్ధి కీలకం

మండల వ్యవసాయ అధికారి విజయరాజు

నిజాంపట్నం: మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ప్రధాన మార్గమని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ విజయరాజు చెప్పారు. మండలంలోని పల్లపట్ల, ముత్తుపల్లి గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్‌కు సంబంధించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అవసరం మేరకు సిద్ధంగా ఉంచామన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించి అర్హత కలిగిన 6,856 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా పంటల బీమా పథకంపై అవగాహన కల్పించి, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ వరి వంగడాలు సిద్ధం: ఏవో

రేపల్లె: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి వంగడాలను సబ్సిడీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు చెప్పారు. మండలంలోని పేటేరు 1, 2 రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీపీటీ 5402 రకం వంగడాలు రూ.38కు, ఎంటీయూ 1224 రకం వంగడాలు రూ.37కు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులకై దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లబాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

వేమూరు: రైతులందరు వెద పద్ధతిలో వరి సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. వేమూరు మండలంలోని వెల్లబాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకున్న రైతులు మొలక శాతం పరీక్షించుకోవాలని సూచించారు. వరి విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా 5 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరు వెద సాగు చేయాలి

అమర్తలూరు(వేమూరు): రైతులందరు ట్రాక్టర్ ద్వారా వెద సాగు చేయాలని బాపట్ల జిల్లా వనరుల శాఖ వ్యవసాయాధికారి డేగల వెంకట్రామయ్య అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి, మూల్పూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్ మాట్లాడుతూ వరి వెద సాగుకు పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. ప్రధానంగా రైతులు విత్తన ఎంపిక, విత్తన మోతాదు, విత్తన శుద్ధి ట్రాక్టరు ద్వారా విత్తేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మొవ్వ శ్రీనివాసరరావు, పెదపూడి సర్పంచ్ ఆనందబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి

భట్టిప్రోలు(వేమూరు): రైతులు పచ్చిరొట్ట ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మరెడ్డి తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని కోనేటిపురం గ్రామం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మట్టి నమూనాలు, పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీ ప్రసూన్న, టి.అఖిల, రైతులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏవో విజయరాజు



వెల్లబాడులోని పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ప్రేమ్‌కుమార్



పెదపూడిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకట్రామయ్య



కోనేటిపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి

క్లుప్తంగా

రైలుపేట పోస్టాఫీసును కొనసాగించాలి

రేపల్లె: రైలుపేటలోని పోస్టాఫీసును రద్దు చేయరాదని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సి.వి.మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 15 సబ్ పోస్టాఫీసులు కలిగిన రేపల్లె హెడ్ పోస్టాఫీసును 2008 నుంచి స్థాయి తగ్గిస్తూ ముఖ్య డాక్‌ఘర్‌గా మార్చటంతో ఈ ప్రాంత ప్రజలు అనేక పోస్టల్ సేవలను కోల్పోయారన్నారు. ప్రస్తుతం పట్టణానికి మధ్యలో రైలుపేటలో ఉన్న సబ్‌పోస్టాఫీసును రద్దు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. తాలూకా కార్యాలయంకు అతి సమీపంలో ఉన్న ఈ సబ్‌పోస్టాఫీసు వినియోగదారులకు ఉపయోగకరంగా ఉందన్నారు. తాలూకా ప్రాంగణంలో 30కిపైగా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు న్యాయస్థానాలు, సబ్‌రిజిస్ట్రార్, ఉపఖజానా వంటి కార్యాలయాలు, బ్యాంక్‌లు, విద్యాసంస్థలకు సమీపంలో ఉండటంతో వినియోగదారులు స్టాంప్‌లు, ఇతర సేవల కోసం ఈ సబ్‌పోస్టాఫీసును ఆశ్రయిస్తున్నారన్నారు. ఈ సబ్‌పోస్టాఫీసును రద్దు చేస్తే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుని వినియోగదారుల సౌకర్యార్థం రైలుపేటలోని సబ్ పోస్టాఫీసును రద్దు చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

సుధీర్‌బాబు కుటుంబ సభ్యులకు పరామర్శ



భట్టిప్రోలు(వేమూరు): అనారోగ్య కారణాలతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలకు పార్టీ సహకారం పూర్తిగా ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. భట్టిప్రోలు మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన జాలాది సుధీర్‌బాబు కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని 10వ వార్డులో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

సైకాలజిస్ట్ విజయరత్నం



రేపల్లె: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో గమ్యాలను చేరుకోవాలని కేఎల్ యూనివర్సిటీ సైకాలజిస్ట్ ఎ.విజయరత్నం చెప్పారు. మాదక ద్రవ్యాల నిర్మూలన – మత్తు రహిత సమాజం అంశంపై పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే పట్టుదలతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం శూన్యమవుతుందన్నారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండటంతో పాటు తోటి వారికి తెలియజెప్పాల్సిన అవసరం విద్యార్థులపై ఉందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.దాసు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ బుజ్జిబాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ బాల గురవయ్య, అధ్యాపకులు కోటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికునికి ఆర్థికసాయం అందజేత



నిజాంపట్నం: నిజాంపట్నం మండలం కళ్ళిఫలం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు కాసాని ఏడుకొండలు ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి కాలును కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అందజేసిన రూ.50 వేల ఆర్థిక సాయంను మంగళవారం గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్‌లు బాధితుడు ఏడుకొండలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ఎస్ఐ శివకుమార్ యాదవ్



చందోలు(కర్లపాలెం): విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని చందోలు ఎస్ఐ ఎం.శివకుమార్‌యాదవ్ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం చందోలు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించటంతో పాటు తోటి విద్యార్థులతో మంచిగా మసలుకోవాలని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు బాలికలు ఎంపిక



సీహెచ్ చైతన్య



సౌజన్య



యాజలి సృజని

అమర్తలూరు(వేమూరు): ట్రిపుల్ ఐటీకి ముగ్గురు బాలికలు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి కనపాల రమేష్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం జరిగిందని ఆయన మంగళవారం తెలిపారు. మోపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ చైతన్య(585) నూజివీడు ట్రిపుల్ ఐటీలో, పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సౌజన్య(578) ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన యాజలి సృజని(570) ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

భట్టిప్రోలులో 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక

భట్టిప్రోలు(వేమూరు): భట్టిప్రోలు మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.తపస్వి, ఎంపీఎస్.మౌనిక, పి.కుసుమశ్రీ, దీప్తి నాగ కౌశల్య ఒంగోలు క్యాంపస్‌కు, వి.మేఘన, వి.లక్ష్మణ్, ఎం.జ్వలిత ఆర్కే వ్యాలీ క్యాంపస్‌కు, వి.శ్రుతి హాసిని, ఎల్.సుష్మైలీ సీట్లు సాధించడం జరిగిందన్నారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాదించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కర్లపాలెం వైద్యాధికారిగా రామకృష్ణ



కర్లపాలెం: కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ పి.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా రామకృష్ణ సత్యసాయి జిల్లా చిలముత్తు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కర్లపాలెం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ సుహానా బేగం చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయి వెళ్లారు.

27న సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరగనున్నదని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ఎంపీడీవో తెలియజేశారు.

కర్లపాలెం పశు వైద్యాధికారిగా తహఅన్సారీ



కర్లపాలెం: కర్లపాలెం పశు వైద్యశాల డాక్టర్‌గా షేక్ తహఅన్సారీ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం నుంచి కర్లపాలెం వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పశు వైద్యాధికారిగా పనిచేసిన రేచల్ దివ్య వెదుళ్ళపల్లికి బదిలీపై వెళ్లారు. పశువుల డాక్టర్ అన్సారీ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 10 వరకు పశువులకు నట్టల నివారణ మందు వేస్తామని తెలిపారు.

కనుల పండువగా పోలేరమ్మ తిరునాళ్ల

- ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభలు
- పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



పోలేరమ్మ అమ్మవారు

బాపట్లటౌన్: మండలంలోని కనకాద్రినగర్‌లో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం తిరునాళ్ల మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల్లోని భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై అమ్మవారి ప్రభలను ఏర్పాటు చేసుకొని కనకతప్పెట్లు, మేళతాళాల నడుమ పాలపొంగళ్లతో ఆలయానికి చేరుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పశు పోషకులు తమ పశు సంపదను చల్లగా చూడు తల్లి అంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణంలో కళాకారులు వేసిన చింతామణి నాటకం, ఆదివాసుల డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరునాళ్ల పురస్కరించుకొని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పమిడిబోయిన వెంకటేశ్వర్లు మంగళవారం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారి కృపతో క్రమం తప్పకుండా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.



పాలపొంగళ్లు, ప్రభలతో అమ్మవారి ఆలయానికి చేరుకుంటున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

తెనాలిఅర్బన్: దోమ కాటు వలన విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న చోట్ల దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. గుడ్ల ద్వారా దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ 2027 నాటికి దేశంలో మలేరియాను నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు తోటకూర రాఘవయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.స్వప్న, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాస్‌రెడ్డి

కొల్లిపర: రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరం, హనుమాన్‌పాలెం పంచాతీయలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు ఉపయోగం, పంటలు సాగు చేస్తే రైతులు ఆశించిన దిగుబడి సాధించవచ్చనారు. కౌలు రైతులు కూలు కార్డుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధాని మంత్రి ఫసల్ బీమా కింద వరి ఎకరానికి రూ.800 రూపాయలు, మినుము పంట ఎకరానికి రూ.200 రూపాయలు ఆగస్టు 15వ తారీకు లోపల రైతులు చెల్లించి ఇన్సూరెన్స్ చేయించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్స్ వితరణ

తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని జెట్టి వెంకటరత్తయ్య, నరసమ్మ మున్సిపాల్ ఎలిమెంటరీ స్కూల్‌కు మంగళవారం రెండు ఐరన్ టేబుల్స్‌ను ఉచితంగా ఇచ్చారు. అలాగే విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.మురళీకృష్ణ, నాయకులు పావులూరి రాంబాబు, కె.ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, మల్లాది అర్జునరావు, ఈదర వెంకట పూర్ణచంద్, ప్రధానోపాధ్యాయులు సునీత, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పొన్నూరు: మండల పరిధి పచ్చల తాడిపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. మానవ అక్రమ రవాణా, గృహ హింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీలదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, అవసరానికి మించి ఉపయోగించకూడదని అన్నారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ తురకా మంగయ్య విద్యార్థులకు ఉచితంగా కామిక్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, సంస్థ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయిని సరళాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణానికి ప్రమాద సూచిక!



ఒక పక్క రహదారి భద్రత అంటూ అధికారులు పదే పదే ఉపన్యాసాలిస్తున్నారు. కానీ రహదారులపై ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న చిత్రం. గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులో ఐదవమైలు–కోయవారిపాలెం సమీపంలో రోడ్డుపై మార్జిన్‌కు చేరువలో గుంత పడింది. గుంతను పూడ్చాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు గుంతలో ఓ కర్ర ముక్కను ఉంచి, దానికి స్టిక్కర్లు అతికించారు. రాత్రి సమయాల్లో దగ్గరకు వచ్చే వరకూ కర్ర కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని.. కర్రను తీసి, గుంతను పూడ్చాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– ప్రత్తిపాడు